క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్ : చిలకపాలెంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ధర్మవరం, కొయ్యాం సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, బొంతలకోడూరు, డి.మత్స్యలేశం, ముద్దాడ, పొన్నాడ, కొంగరాం, ఓలేటి అగ్రహారం, భగీరథపురం, ధర్మవరం, కొయ్యాం, కుప్పిలి, బడివానిపేట, అజ్జరాం పంచాయతీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిగా గంగా ప్రియదర్శిని



ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ గంగా ప్రియదర్శిని మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన వి.కిశోర్‌కుమార్ విశాఖపట్నం బదిలీ అయ్యారు. ఈయన నాలుగేళ్లగా ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందజేశారు. కోవిడ్ సమయంలో వ్యాక్సినేషన్, క్వారంటైన్ సెంటర్ల నిర్వహణ వంటివి సమర్థంగా నిర్వహించారు. బదిలీపై వెళుతున్న కిశోర్‌కుమార్‌కు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

ఎస్పీని కలిసిన హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైమ్/శ్రీకాకుళం : తమ సమస్యలు విన్నవించేందుకు హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎస్పీ జి.ఆర్.రాధికను జిల్లా పోలీసు కార్యాలయంలో కలిశారు. వారంరోజులుగా హోటళ్లు, రెస్టారెంట్లను పోలీసులు రాత్రి పదిగంటలకే మూసివేస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. సమస్యపై ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మురళి, సెక్రటరీ మెట్ట నాగరాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీను, సెక్రటరీ సతీష్, రాజశేఖర్, స్టేట్‌జాయింట్ సెక్రటరీ వినోద్, టౌన్ సెక్రటరీ గణపతి సుదర్శన్ పట్నాయక్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, మురళి పాల్గొన్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల వెల్లడి



ఫలితాల షీల్డ్‌కవర్‌ను ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో 2021–22 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల 4వ సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ 73.37 శాతం ఉత్తీర్ణ సాధించినట్టు చెప్పారు. గ్రూపుల వారీగా బీఏలో 81.25 శాతం, బీఎస్సీలో 63.67 శాతం, బీకాం(జనరల్)లో 93.62 శాతం, బీ.కాం(ఒకేషనల్)లో 94 శాతం ఫలితాలు సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పీఎస్ కనకదుర్గ, పి.ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సీహెచ్ కాత్యాయని పాల్గొన్నారు.

‘ఎచ్చెర్ల టికెట్ నాదే’



ర్యాలీగా వెళ్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గ తెలుగుదేశం టికెట్ తనదేనని ఉత్తరాంధ్ర తెలుగుదేశం పార్టీ శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్, ఎచ్చెర్ల టీడీపీ నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రణస్థలంలో మంగళవారం జరిగిన ఆయన పుట్టిన రోజు వేడుకల్లో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ ఆశీస్సులు మెండుగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమావేశం నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ శ్రేణులకు బుధవారం ‘వై నీడ్స్ ఏపీ జగన్’ కార్యక్రమం నిర్వహణపై శిక్షణ నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కుశాలపురం బైపాస్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎమ్మెల్యే కిరణ్ శిక్షణ ప్రారంభిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

సీవీ రామన్, మేడం క్యూరీ సేవలు చిరస్మరణీయం

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల, పీఎస్ఎస్ఎం పాఠశాలల్లో మంగళవారం సర్ సీవీ రామన్, మేడం క్యూరీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- గ్రిగ్స్ పోటీలు ప్రారంభం



రణస్థలం: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గ్రిగ్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విద్యారంగ అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం జరిగిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు సత్తాచాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామునాయుడు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, నాయకులు మైలపల్లి కామరాజు, కిల్లారి రమణ, రెడ్డి విశ్వేశ్వరరావు, మహంతి చినరామినాయుడు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, గొర్లె అప్పలనర్సునాయుడు, పి.సాయిరాం, రెడ్డి వాసు, టీకే బ్రహ్మజీ, పిన్నింటి సత్యంనాయుడు, ఎంఈఓలు ఏ.త్రినాథరావు, బి.లావణ్య, హెచ్‌ఎం రమణయ్య, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గార: మండలంలోని సాందీపని విద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. తొలిరోజు బాలుర పోటీల నిర్వహించగా, రెండో రోజు బాలికల మధ్య పోటీలు జరగ్గా.. స్కూల్ కరస్పాండెంట్ అంబటి చక్రధరరావు ప్రారంభించారు. బాలికల సీనియర్స్ విభాగంలో గార జెడ్పీహెచ్ఎస్, వమరవల్లి గురుకులం వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ విభాగంలో వమరవల్లి గురుకులం, కళింగపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఖోఖోలో సాందీపని, వమరవల్లి గురుకులంలు వరుస స్థానాల్లో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో కబడ్డీ కళింగపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు విజయం సాధించాయి. ఖోఖోలో వమరవల్లి గురుకులం, సతివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. పోటీల్లో ఎం.సాంబమూర్తి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. జి.సిగడాంలో మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అరసాడ రవి, ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



గార: బాలికల కబడ్డీ పోటీ



జి.సిగడాం: ఖోఖో పోటీలో తలపడుతున్న బాలికలు



జి.సిగడాం: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజలతో చేరువయ్యేందుకే పల్లెనిద్ర

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ప్రజలతో మమేకమౌతూ వారి సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 9 నుంచి ఎచ్చెర్ల నియోజకవర్గంలోని గ్రామాల్లో ‘ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..’ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమంలో భాగంగా పల్లె నిద్ర విధివిధానాలపై విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 9న జి.సిగడాం, చిలకపాలెం, లావేరు–1, జె.ఆర్.పురం–1 సచివాలయాల పరిధిలో పల్లెనిద్ర, పార్టీ జెండా ఆవిష్కరణ, పార్టీ శ్రేణులతో సహపంక్తి భోజనం తదితర కార్యాక్రమాలు ఉంటాయని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో తొలుత రెండు గంటల పాటు అధికారులు ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరిస్తారని తెలిపారు. అనంతరం గ్రామపెద్దలతో గ్రామాభివృద్ధిపై సమావేశం నిర్వహిస్తామని, అందరూ కలిసి భోజనం చేసి గ్రామంలోనే పల్లె నిద్ర చేస్తామని వివరించారు. మండల పార్టీ అధ్యక్షుల పర్యవేక్షణలో కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల నాయకులు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల నాయకులు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ముద్దాడ శంకర్, జేసీఎస్ ఇన్‌చార్జిలు మీసాల శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, నాయకులు మైలపల్లి కామరాజు, మీసాల రాంబాబు, అలుపన నారాయణరెడ్డి, గురాన మానస, మురళీధర్ బాబు, జీరు రామారావు, గొర్లె అప్పలనర్సునాయుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, చినరామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నామని, కుల, ప్రాంత, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. మంగళవారం మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించి లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సిఫారసులకే ప్రాధాన్యమిచ్చేవారని, ఈ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పథకాలు వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ పీస గోపి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, సర్పంచ్ జి.అనిత, అంధవరపు బాలకృష్ణమూర్తి, బరాటం శ్రీధర్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, జేసీసీ అధ్యక్షుడు కొయ్యాన నాగభూషణం, మార్పు పృథ్వీరాజ్, ఊట అప్పలనాయుడు, కోటి, రాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ప్రగతి బోర్డులు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



టెలి కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ సచివాలయాల వారీగా ప్రగతి బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులు, సచివాలయాల సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లతో జీఓ ఎంఎస్ నెం :07 నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఈ ప్రభుత్వ హయాంలో ఏం మేలు జరిగిందన్నది ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. మండలానికి ఒక సచివాలయం చొప్పున ప్రతిరోజు కార్యక్రమం ఉంటుందని, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. జగనన్న సురక్ష, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తరహాలోనే షెడ్యూల్ ఉంటుందని వివరించారు. గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో చేపట్టిన అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ ఈ నెల 9 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేవంలో జిల్లా పరిషత్ సీఈవో ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: లింగ నిర్ధారణ నేరమని, బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అల్ట్రా సౌండ్ కేంద్రాల నిర్వాహకులతో సమావేశమై లింగ నిర్ధారణ వెల్లడించకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ జిల్లా నుండి ఐఏఎస్‌కు ఎంపికైన మహిళా అధికారులు, కరణం మల్లీశ్వరి వంటి క్రీడాకారిణులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శాంతిశ్రీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డ్రాపౌట్స్ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వెంకటరమణ, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వాసుదేవరావు, ఐటీడీఏ ఏపీఓ రోసి రెడ్డి, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, ఏడీ ఎం.శ్రీనివాసరావు, ఎల్డీఎం సూర్యకిరణ్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇచ్చేందుకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు మంగళవారం వానవానిపేట, తంగివానిపేట, సింగుపురం ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో ఇల్లులేని నిరుపేదలను గుర్తించి స్థలాలు మంజూరు చేయాలని తహశీల్దార్ ఎస్.వెంకటరావును ఆదేశించారు. సింగుపురం పరిసర ప్రాంతాల్లో తొమ్మిది ఎకరాలను ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే రాత్రి నేరాలకు అడ్డుకట్ట



శ్రీకాకుళం ప్రకాష్‌నగర్‌లో పాయింట్ బుక్ తనిఖీ చేస్తున్న ఎస్పీ. చిత్రంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

శ్రీకాకుళం క్రైమ్ : రాత్రివేళ జరిగే చోరీలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు రాత్రి గస్తీల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక నైట్‌బీట్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం అర్ధరాత్రి 12 నుంచి మంగళవారం వేకువఝాము 4 గంటల వరకు ఎస్పీ, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి శ్రీకాకుళం, జె.ఆర్.పురం, నరసన్నపేట కేంద్రాలుగా చేసుకుని నైట్‌బీట్ పోలీసులు, హైవే మొబైల్ పెట్రోల్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రివేళ ప్రతీ బీట్ పాయింటును క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నేర నివారణకు నిరంతరం వాహన తనిఖీలు చేయాలని, అనుమానితులు తారసపడితే గుర్తింపుకార్డులు పరిశీలించి వేలిముద్రలు తనిఖీ చేయాలన్నారు. ఏటీఎంలు, బ్యాంకుల వద్ద సెక్యూరిటీ గార్డులు నిద్రపోకుండా అప్రమత్తం చేయాలన్నారు. లాడ్జిల్లో రికార్డులు పరిశీలించి తేడాలుంటే యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచి పాయింట్ బుక్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న పేడాడ పరమేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళాన్ని కరువు జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇందిర విజ్ఞాన భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న రైతు రణభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం కోసం వినతి

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలో ఎస్సీ కులస్తులు సమావేశాలు నిర్వహించుకునేందుకు అంబేడ్కర్ సామాజిక భవనం మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ మండల సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్‌లకు కలిసి వినతిపత్రం అందజేశారు. మండల శాఖ అధ్యక్షుడు పల్ల నీలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సాకేటి పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణులకు అభినందనలు



క్రీడాకారిణులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ నెల 4 నుంచి 6 వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ట్రోఫీలు, పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎం.వి.రమణ, ఎం.సాంబమూర్తి, బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, శిక్షకుడు ఎం.మధుసూదన్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు జి మల్లేష్, బీహెచ్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

19న అంబేడ్కర్ జాతర



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

రణస్థలం: ఎచ్చెర్లలో ఈ నెల 19న జరిగే అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలని సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క క్రిష్ణయ్య, సామాజిక న్యాయ పోరాట జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్ పిలుపునిచ్చారు. రణస్థలంలో ఏపీ దళిత మహాసభ, ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు సాకేటి పోతయ్య, కుప్పిలి సీతప్పడు, పైడిరాజు, దుక్క ఆదినారాయణ, అప్పారావు, లండ రామప్పడు, నెలివాడ రాము, దత్తి గోవింద పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో గూనపాలెంలో నివాసముంటున్న ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. భర్తతో గొడవపడి స్నేహితురాలింట్లో పాపతో కలిసి ఉంటున్న ఈమె కలెక్టరేట్‌లో పని ఉందంటూ ఈ నెల 5న ఉదయం వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు ఆమె తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల ప్రగతి కోసం ఇంజినీరింగ్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపొనెంట్ పనులపై సమీక్షించారు. సమావేశంలో పీఆర్ జేఈ సూర్యచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దివ్య, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్, మండల పరిషత్ విప్ బగ్గు రాజారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పైడి భాస్కరరావు, యువజన విభాగం అధ్యక్షుడు కొత్తకోట సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో ‘గ్రీన్ స్కూల్ ప్రోగ్రాం’

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ప్రతి పాఠశాలలో ‘గ్రీన్ స్కూల్’ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ పూజారి గోవిందరావు పిలుపునిచ్చారు. గుజరాతీపేటలో ఉన్న అంధవరపు వరం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో సోమ, మంగళవారాల్లో శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ గాలి, నీరు, నేల, శక్తి, వ్యర్థాల నిర్వహణ, జీవవైవిధ్యం అనే ఆరు అంశాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేసి ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో జాతీయస్థాయి అవార్డుని బహూకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కో–ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న, హెచ్‌ఎం పి.ఇందిరామణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మూలపేట పునరావాస కాలనీల్లో పనులు చేపట్టాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట పునరావాస కాలనీల్లో పనులు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. పునరావాస కాలనీల్లో రహదారులు, కాలువలు, తాగునీటి సరఫరాపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత రోడ్లు, కాలువలను త్వరితగతిన నిర్మించాలన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. నిధులు ఇప్పటికే మంజూరు చేసినట్లు వివరించారు. తేలినీలాపురం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ఈ ప్రసాదరావు చెప్పారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ సత్యనారాయణమూర్తి, సర్వే శాఖ ఏడీ విజయ్‌కుమార్, డీఈ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు శ్రీనివాసరావు, రామమూర్తి, ఏఈలు పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మూకల అప్పారావు అధ్యక్షతన, బమిడి నరేంద్ర రాష్ట్ర సహాధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడిగా టి.జగన్నాథం, అధ్యక్షుడిగా సూర పాపారావు, ప్రధాన కార్యదర్శిగా సీపాన ముకుందరావు, ఆర్థిక కార్యదర్శిగా వావిళ్లపల్లి రాజారావు, కార్యవర్గ సభ్యులుగా డి.జనార్దనరావు, బోకర శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్, ఎస్.విశ్వనాథం, వి.విష్ణుమూర్తి, ఎన్.అప్పలనాయుడు ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి.హైమారావు, ఎం.చిరంజీవులనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.